క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



పుట్టకొండలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

పెదపూడి: మండలంలోని పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహ స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ఈఓ సీహెచ్ రమణమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరూ ఆధ్యాత్మిక భావాలు అలవరుచుకుని భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పూజించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి లక్ష పత్రి పూజ

పెదపూడి: పెదపూడిలో ప్రసిద్ధి చెందిన శ్రీశ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు కొమ్మాల్లపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు లక్ష పత్రి పూజ మంగళవారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీరాజరాజేశ్వరీ ఆలయం వద్ద మంగళవారం అర్చకులు గరిమెళ్ళ గాంధీ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు పడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త గుట్టల తొలగింపు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని తుల్యభాగ నదీ పాయ రేవులో పేరుకుపోయిన చెత్తను ఇటీవల జేసీబీ సాయంతో తొలగించి రోడ్డుపై గుట్టలుగా వేశారు. ఆ చెత్త గుట్టలను మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ వాహనాల్లో తరలించారు.

కొనసాగుతున్న గాలింపు

సీతానగరం: పురుషోత్తపట్నం వద్ద గోదావరిలో ఇనపాల జార్జి రాజు కోసం మూడో రోజు మంగళవారం గాలింపు చర్యలు కొనసాగాయని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. పురుషోత్తపట్నానికి చెందిన 41 ఏళ్ల జార్జి రాజు గోదావరిలో కొట్టుకు వచ్చే కట్టెల కోసం వెళ్లి, తిరిగి ఇంటికి రాకపోవడంలో ఈనెల 30న కుమారుడు సత్యేంద్ర ఫిర్యాదు చేశాడన్నారు. వీఆర్వో గోసాల చిన్నా తదితరులు గోదావరి ఒడ్డున దుబ్బులు, లంక భూముల ఒడ్డున గాలించారన్నారు. ఇంకొందరు ఇతర గ్రామాల లంక భూముల వద్ద గోదావరి ఒడ్డున, అలాగే రాజమహేంద్రవరం కోటిలింగాల రేవు తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఇంతవరకూ జార్జిరాజు ఆచూకీ లభించలేదని తెలిపారు.

ప్రచార రథయాత్ర

గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెలో టీడీపీ మహిళా శక్తి ప్రచార రథయాత్రను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మహిళలు, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను వివరించారు.

సేవలతో నవశకానికి నాంది



లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హుల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తూ నవ శకానికి నాంది పలికారని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రామవరం గ్రామ సచివాలయం-1లో జరిగిన కార్యక్రమంలో 55 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాలతో గతంలో కొంతమందికి రేషన్ కార్డులు నిలిపేశారన్నారు. అయితే వారిలో అర్హుల్ని గుర్తించి కార్డులు మంజూరుచేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, గిరడా రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి పర్యటించారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు.

వయ్యారి భామ.. ప్రమాదం సుమా..

- విస్తరిస్తున్న పార్థీనియం మొక్కలు
- తాకితే రోగాలే
- పశువులు, పంటలకూ నష్టం



జితేంద్రనాథ్

రాజానగరం: చూడటానికి ఎంతో అందంగా కనిపించే ఈ పూల మొక్క ఎంతో ప్రమాదకరమైంది. అందంగా ఉంది కదా అని తాకితే మనం రోగాల బారిన పడకతప్పదు. పేరుకు వయ్యారి భామేగాని, అంటుకుంటే చర్మవ్యాధులు తప్పవు. వ్యవసాయంలో పంటలకు కూడా ఇది తీవ్ర నష్టాన్ని కూడా కలిగిస్తోంది. ప్రపంచంలోనే మొండి జాతికి చెందిన 10 రకాల కలుపు మొక్కలలో పార్థీనియం ఒకటి. ఇది అమెరికాకు చెందిన కలుపు మొక్క. సుమారు 70 ఏళ్ల క్రితం గోధుమ విత్తనాల దిగుమతి ద్వారా మన దేశంలో ప్రవేశించింది. దీనిని ఇక్కడ వయ్యారి భామ, మాచర్ల కంప, ముక్కు పుడకగా పిలుస్తుంటారు. ఉత్తర భారత దేశంలో అమెరికా అమ్మాయి, క్యారెట్ గ్రాస్, కాంగ్రెస్ గ్రాస్, నక్షత్ర గ్రాస్, ఛతక్ చాందిని అంటారు. ఈ మొక్క వల్ల వ్యవసాయంలో 40 శాతం వరకూ పంట నష్టం వాటిల్లుతోంది. చూడటానికి అందంగా కనిపించే ఈ మొక్కలను వదిలేస్తే ఎన్నో సమస్యలు వస్తాయంటున్నారు కలవచర్ల, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో పనిచేసి రిటైర్ అయిన సేద్యపు పంటల అధికారి జితేంద్రనాథ్.

అరువారాల్లోనే పూతదశకు..

పార్థీనియంగా పిలువబడే ఈ పూలమొక్క సుమారు రెండు మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు చీలికలతో కూడి సన్నటి నూగులాంటి రోమాల మాదిరిగా శాఖోపశాఖలుగా కొమ్మలతో ఏపుగా ఉంటుంది. మొలకెత్తిన నాలుగు నుంచి ఆరు వారాలల్లోనే పూత దశకు వస్తుంది. ఒక్కో మొక్క 10 వేల నుంచి 25 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వీటి విత్తనాల పైభాగం జుత్తు కలిగి ఉండడం వల్ల గాలి, నీరు, పశువులు, మనుషులు, వ్యవసాయ పనిముట్ల ద్వారా సులువుగా వ్యాపిస్తాయి. ఈ మొక్కలోని అన్ని భాగాల్లో (కాండం, ఆకులు, కొమ్మలపై నూగు, పుప్పొడి) పార్థీనిస్ అనే విష పదార్థం ఉంటుంది. దానివల్ల మానవాళికి, పశువులకు వివిధ రకాల రోగాలు సంభవిస్తాయి. ముఖ్యంగా పంట పొలాలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాలు, రహదారుల పక్కన, పార్కులు, రైల్వే లైన్ వెంబడి ఉండే ఖాళీ ప్రదేశాలలో ఇవి విస్తారంతా వ్యాపిస్తాయి. ఇవి సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకూ గాలి ద్వారా వ్యాప్తించి మొలకెత్తుతాయి.

ఎన్నో నష్టాలు

- మన ప్రాంతంలో వయ్యారి భామగా పిలిచే ఈ పార్థీనియం మొక్కల పుప్పొడి వల్ల మనుషుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధులు (ఆస్తమా), చర్మవ్యాధులు, విష జ్వరాలు, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయి. వీటి ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వస్తుంది. పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడటం, కనురెప్పలు వాపు సంభవిస్తాయి..
- పశువులకు ఊపిరితిత్తుల వ్యాధులు, జ్వరాలు, చర్మవ్యాధులు సోకుతాయి. వీటి స్పర్శతోనే జంతువులకు వెంట్రుకలు రాలిపోతాయి.
- సాధారణంగా వీటిని పశువులు తినవు. పొరబాటున గడ్డితోపాటు ఆరగిస్తే వాటికి చర్మ సంబంధమైన వ్యాధులు కలగడమే కాకుండా పాడి పశువులలో పాల ఉత్పత్తి తగ్గి, బరువు కూడా కోల్పోతాయి.
- ఇవి ఒక రకమైన రసాయనాన్ని వేర్ల ద్వారా స్రవించి ఇతర మొక్కలను మొలకెత్తకుండా నిరోధిస్తాయి. ఇవి ఉన్న ప్రాంతంలో వేరొక మొక్కలు బతకవు.
- పచ్చిక మైదానాల్లో గడ్డి రాకుండా, ఎదగకుండా చేస్తుంది. ఈ కారణంగా పశుగ్రాసం కొరతకు కారణమవుతాయి. వీటికి త్వరగా పెరిగే గుణం ఉండటంతో వేరుతో పెకలించకుండా కోస్తే, మళ్లీ త్వరగా పెరిగిపోతాయి.
- పొలాలలో విపరీతంగా వ్యాపించడమే కాకుండా ఆయా పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చివేస్తాయి. తద్వారా పంటలను ఎదగకుండా చేయడంతో దిగుబడులు గణనీయంగా పడిపోతాయి.
- ఈ మొక్కల పుప్పొడి వలన టమాట, వంగ, చిక్కుడు వంటి కూరగాయల మొక్కలు, పాదులు పూత రాలిపోయి, కాయలు ఏర్పడవు. వివిధ పంటలకు సోకే పిండినల్లికి ఈ మొక్కలు నివాస స్థలాలుగా ఉపయోగపడతాయి.

సమగ్ర నివారణ పద్ధతులు

- పార్థీనియం మొక్కలను నిర్మూలనను గ్రామాల్లోని రైతులందరూ తమ పొలాల్లో సామూహికంగా చేపట్టాలి. పూత రాక ముందే ఈ మొక్కలను వేర్లతో సహా పీకి, తగలబెట్టాలి. ఆపై ఎక్కడైనా మొక్కలు మొలిస్తే వెంటనే వాటిని కూడా వేర్లతో సహా పెకలించాలి. ఈ విధంగా నాలుగైదు సంవత్సరాలు చేస్తేనే వీటిని పూర్తిగా నివారించవచ్చు.
- వేసవిలో పొలాలను లోతుగా దుక్కి చేయడం వలన కలుపు విత్తనాలు కూడా లోతకు పోయి మొలకెత్తవు. తద్వారా పార్థీనియం ఉత్పత్తి తగ్గుతుంది.
- వీటి ఉధృతి ఎక్కుగా ఉన్న పొలాలలో బంతి పంట మార్పిడి సాగు ద్వారా కూడా కలుపును నివారించవచ్చు.
- జై గో గ్రామా, బై కొలరేటా అనే కీటకాలు ఈ మొక్కల ఆకుల, కాండాన్ని తినడం ద్వారా సమర్థవంతంగా నివారించవచ్చు. పొలంలో ఈ మొక్కల తీవ్రతను అనుసరించి 500 నుంచి వెయ్యి వరకు పైన పేర్కొన్న కీటకాలను వదలాయి. అవి ఈ మొక్కలను సమగ్రంగా ఆరగిస్తాయి.
- పైరుసాగు చేయని పొలాల్లో ఈ కలుపు మొక్క పూత దశకు రాకముందే ఉప్పు ద్రావణాన్ని 15 లేదా 20 శాతం (లీటరు నీటిని 150 లేదా 200 గ్రా.) పిచికారీ చేయాలి. వేసవిలో ఎకరాకు గ్లైఫోసేట్ ఒకటి లేదా 1.5 లీ. పూత దశకు రాకముందే కలుపు మొక్కల పై పిచికారీ చేయడం ద్వారా కూడా వీటి ఉధృతిని తగ్గించవచ్చు.



వయ్యారి భామ (పార్థీనియం) మొక్కలు

పీహెచ్‌సీలో ప్రసవాలను ప్రోత్సహించాలి

సీతానగరం: పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా గర్భిణులను ప్రోత్సహించాలని ఆశావర్కర్లకు డాక్టర్ రాజు సూచించారు. సీతానగరం పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు పడుతున్నందున పంచాయతీల సహకారంతో యాంటీ లార్వా మందును వారానికి ఒకసారి పిచికారీ చేయించాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో వెంకటరత్నం, మండలంలోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ను వృథా కానీయొద్దు

బిక్కవోలు: ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలకు ఉచితంగా అందిస్తున్న విద్యుత్‌ను వృథా చేయొద్దని ఇలపల్లి ఎత్తిపోతల కార్యనిర్వాహక అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. మంగళవారం తుమ్మలపల్లిలో ఎత్తిపోతల ఆయకట్టు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉచితమే కదా అని నిర్లక్ష్యం తగదని, అవసరానికి తగ్గట్టు పొదుపుగా వాడి ఎక్కువ పంటలు పండించాలని సూచించారు. కార్యక్రమంలో ఎత్తిపోతల డైరెక్టర్ పోలినాటి సూర్యప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి

గోకవరం: ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శ్రీరంగ రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ అన్నారు. సోమవారం వీరలంకపల్లిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా సుమారు 22 లక్షల వ్యయంతో ప్రతి ఇంటికి కుళాయి పనులకు వారు శంకుస్థాపన చేశారు. వైస్ ప్రెసిడెంట్ అల్లాడ రాంబాబు, చింతల అనిల్ పాల్గొన్నారు.

కలవచర్లలో రూ.5.30 కోట్లతో అభివృద్ధి పనులు



కలవచర్లలో బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..

రాజానగరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడచిన నాలుగేళ్లలో కలవచర్లలో రూ.5.30 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. అదే గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కేవలం రూ.13 లక్షలు మాత్రమే అభివృద్ధికి వెచ్చించిందన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఆ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పలకరించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాజానగరం జాతీయ రహదారి నుంచి కలవచర్ల మీదుగా కోరుకొండకు డబుల్ రోడ్డు విస్తరిస్తున్నామన్నారు. ప్రజలకు ఏమి కావాలో ముందుగానే తెలుసుకుని, అడగకుండానే అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, దంతులూరి రఘువర్మ, పూడి పెద కాపు, కమిడి కృష్ణ, చింతా శ్రీను, పసుపులేటి వాసు, చల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట తప్పని నేత జగనన్న



కొంకుదురు సావరంలో స్థానిక మహిళకు సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని నేత అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కొంకుదురు గ్రామంలోని కొంకుదురు సావరంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ఆయా కుటుంబాలకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చినవే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ దీవించాలని కోరారు. కొంకుదురు సావరంలో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న పలు సీసీ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోని సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీపీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ అధ్యక్షుడు బొడ్డు ముత్యాలరావు, పందలపాక సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండలం కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, పంచాయతీ వార్డు సభ్యులు ఉమామహేశ్వరరెడ్డి, కాశీఅన్నపూర్ణ, గుత్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగన్‌ను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తంటికొండలో గడపగడపకూ మన ప్రభుత్వం

గోకవరం: రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పక్క రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. సోమవారం తంటికొండలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. స్థానిక నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా ? అని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, గతంలో ఎన్నడూ లేనంత విధంగా ఈ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. సమస్యలన్నీ గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దాసరి శ్రీరంగరమేష్, సుంకర వీరబాబు, జనపరెడ్డి సుబ్బారావు, బదిరెడ్డి రెడ్డియ్య, బదిరెడ్డి అప్పన్న దొర పాల్గొన్నారు.



తంటికొండలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సింగంపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగ సూర్య శ్రీవిద్య



చినకొండేపూడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ.అనూష కోరారు. రంగంపేట గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు, గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సింగంపల్లిలోని సచివాలయంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.నాగ సూర్య శ్రీవిద్య పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. అనంతరం గ్రామంలో నడవలేని, మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

423 మందికి వైద్యసేవలు

సీతానగరం: చినకొండేపూడిలో మంగళవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 423 మందికి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. ఇంటి వద్ద ఉన్న రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులకు వైద్యసేవలు అందించారు. సెంటర్‌లోని పిల్లలకు వైద్య పరీక్షలు జరిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశావర్కర్లు సీత, లక్ష్మి, ఆశాలత, రాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ బీసీ సెల్ అధ్యక్షుల నియామకం

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులను నియమించామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. రాజానగరానికి మరుకుర్తి వెంకటేశ్వర్రావు (పుణ్యక్షేత్రం), కోరుకొండకు వంక అప్పన్న (రాఘవపురం), సీతానగరానికి వంగూరి నాగేశ్వర్రావు (ఇనగంటివారిపేట)ను నియమించారు. అలాగే వాణిజ్య విభాగానికి సంబంధించి రాజానగరం మండలానికి దవులూరి శ్రీనివాస్, కోరుకొండ మండలానికి సత్యవరపు సుధీర్, సీతానగరం మండలానికి గూడెపు శ్రీనివాస్ నియమితులయ్యారు.

బూత్ లెవల్ ఏజెంట్లు క్రియాశీలకంగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిలు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి బూత్ లెవల్ ఏజెంట్ క్షేత్ర స్థాయిలో బీఎల్వోలతో కలిసి సర్వేలో పాల్గొనాలని సూచించారు. దొంగ ఓట్లను చేర్చేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్ల వివరాలు జాబితాలో సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. రాబోయే ఎన్నికలు అత్యంత కీలకమని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ పోలింగ్ బూత్ ఇంచార్జ్ యామన దుర్గారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పోలింగ్ బూత్ ఇన్‌చార్జ్‌లు, పోలింగ్ బూత్‌ల ఏజెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కేసు రికార్డుల పరిశీలన



రాజానగరం పోలీసు స్టేషన్‌లో కేసు రికార్డులను పరిశీలిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు

రాజానగరం: ఒక కేసు దర్యాప్తులో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు దుష్యంత్ సింగ్, బీఎస్ షెకావత్ మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ స్టేషను పరిధిలో 2015లో జరిగిన ఒక సంఘటనపై చేసుకున్న అప్పీల్‌పై ఇక్కడికి వచ్చారు. అప్పటి సీఐగా విధులు నిర్వర్తించిన శంకర్ నాయక్‌ను ప్రశ్నించారు. ఆ కేసుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కాగా ఈ విషయమై కమిషన్ సభ్యులను వివరణ కోరగా 2015లో జరిగిన ఒక సంఘటనలో తనకు సరైన న్యాయం జరుగలేదంటూ రంపా మోహన్ అనే వ్యక్తి తమకు చేసిన ఫిర్యాదుపై విచారణకు వచ్చామన్నారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

తొలి రోజే 98 శాతం పంపిణీ



పందలపాకలో పింఛన్ పంపిణీ



చంద్రేడులో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ జానీ మహమ్మద్

రంగంపేట: ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జాము నుంచే వలంటీర్లు తలుపు తట్టి మరీ వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తుండటంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వికసిస్తోంది. మండలంలో మొత్తం 8,855 మంది లబ్ధిదారులుండగా ప్రభుత్వం రూ.2,43,30,750 మంజూరు చేసింది. మండలంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు కలిసి ఇంటింటికీ వెళ్లి తొలి రోజే 98 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. కొందరు లబ్ధిదారులు వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో బుధవారం అందజేయనున్నారు.

బిక్కవోలు: మండలవ్యాప్తంగా మంగళవారం వేకువజాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. తొలిరోజు సాయంత్రానికే 76.86 శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 10,410 పింఛన్లకు గాను 8,001 పింఛన్లు పంపిణీ చేశారు. తొలి రోజు సర్వర్ ఇబ్బంది కారణంగా పంపిణీ ఆలస్యమైందని వలంటీర్లు తెలిపారు.